
సాక్షి
వికారాబాద్

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



పశువుల సంత మార్చండి

వికారాబాద్ పట్టణం మధ్యలో ఉన్న పశువుల సంతను దూరంగా తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 8లో▸



పోటెత్తిన పోలేపల్లి

నాలుగు రోజులుగా కన్నుల పండువగా సాగిన పోలేపల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. 8లో▸



కాలినడకా కష్టమే..

కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా కంకర తేలడందో నడకా నరకంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి గ్రామాలను కొత్త మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే కేవలం రెవెన్యూ కార్యాలయాలను మాత్రమే ప్రారంభించామని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. రెవెన్యూ కార్యాలయాలకు నూతన భవనాలు వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్లకు నూతన భవనాలు, వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మండల స్థాయిల్లో ఉండే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కూడా అనుమతి ఇవ్వాలన్నారు. ఆయా శాఖల మంత్రులు స్పందించి నూతన భవనాలు వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పుష్కరిణిలో పడి జింక మృతి

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరిగుట్ట ఆలయ పుష్కరిణిలో ఓ జింక పడి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరిలోని పుష్కరిణి వద్దకు ఓ జింక నీటి కోసం వచ్చి ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు పుష్కరిణిలో జింక పడి మృతి చెందినట్లు గమనించారు. ఇదిలా ఉంటే ఇటీవల మరో జింక రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందింది. ఇలా జింకలు మృత్యువాత పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు దృష్టిసారించాలని జంతుప్రేమికులు కోరుతున్నారు.

శ్రీనివాస్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న మంచన్‌పల్లి శ్రీనివాస్

పరిగి: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు మంచన్‌పల్లి శ్రీనివాస్ జాతీయ అంబేడ్కర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ రాధాకృష్ణ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. వచ్చే నెల మార్చి 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్య అకాడమీ ప్రతి ఏటా ప్రజా ఉద్యోమకారులు, సంఘం సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ఈ అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు గౌతం మల్లే తదితరులు పాల్గొన్నారు.


కల్తీ విత్తనాలపై చర్యలు తీసుకోండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కల్తీ విత్తనాల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించారు. ఆదివారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గంలోని ఓ రైతు కొనుగోలు చేసిన కూరగాయల విత్తనాలు నాణ్యత లేకపోవడంతో నష్టపోయాడని సభ దృష్టికి తెచ్చారు. నాణ్యమైన విత్తనాలను అందించాలంటే ప్రైవేట్‌కు అప్పగించకుండా ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీడ్‌ను పండించేందుకు నియోజకవర్గంలో అనువైన పొలాలు ఉన్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో మాంసం, చేపల విక్రయాలను మున్సిపాలిటీ నిర్వహిస్తుందా లేక ప్రభుత్వమే చూసుకుంటుందా అని ప్రశ్నించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కల్తీ విత్తనాల బెడద లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

బోనం ఎత్తిన పల్లెలు



బంట్వారం: రొంపల్లిలో బోనాల సందడి



పెద్దేముల్: గొట్లపల్లిలో బోనమెత్తిన మహిళలు

పెద్దేముల్: పల్లెలు బోనమెత్తాయి. గ్రామదేవతలకు, మల్లన్నస్వామికి బోనాలతో తరలివచ్చి పూజలు చేశారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి శివారులో ఆదివారం మల్లికార్జున స్వామి జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణం కనులవిందుగా సాగింది. మహిళలు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. జాతర ముగింపు రోజు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

గ్రామ దేవతల ఉత్సవాలు

బంట్వారం: మండల పరిధిలోని రొంపల్లిలో గ్రామ దేవతల ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుల చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో మహిళలు బోనాలతో తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. నాలుగురోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి.

పాలకులవి కోతలే!

వ్యవసాయ రంగానికి నిరంతరం విద్యుత్ సరఫరా హుష్‌కాకే.. క్షేత్రస్థాయిలో పంటలు ఎండుతుండటం.. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటం చూస్తుంటే ఇది నిజమని పలువురు భావిస్తున్నారు. విద్యుత్ సరఫరాపై పాలకుల మాటలు నీటిమూటలుగా మారుతున్నాయి. రోజుకు కనీసం నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడంలేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా పంటలకు నీరు అందక ఎండుముఖం పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– తాండూరు

నిరంతర విద్యుత్ హుష్‌కాకి!

- రైతన్నకు తప్పని వెతలు
- నాలుగు గంటలు కూడా సరఫరాకాని కరెంట్
- ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



వ్యవసాయ పొలం వద్ద ఎండుతున్న సోయా పంటను చూపిస్తున్న రైతు వెంకటయ్య

జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు:	67,217
బోరుబావుల కింద సాగు ఎకరాల్లో:	2 లక్షలు

ప్రత్యేక రాష్ట్రం వస్తే రాష్ట్రంలో రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తాం.. అంటూ నాటి కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కొంత వరకు మాట నిలబెట్టుకున్నా బీఆర్‌ఎస్ పార్టీగా అవతరించాక విద్యుత్ కోతలు పెరిగాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొంది. యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలకు కేవలం నాలుగు గంటల పాటే విద్యుత్ సరఫరా చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంతో రైతులు తల్లడిల్లుతున్నారు. జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో బోరుబావుల ద్వారా పంటలను సాగు చేస్తున్నారు. రెండు విద్యుత్ డివిజన్‌ల కింద వ్యవసాయ బోరుబావులకు 67,217 విద్యుత్‌సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో 1100లకు పైగా చెరువులు ఉన్నా వాటి ద్వారా రైతులకు సాగు నీరు అంతంత మాత్రంగానే అందుతాయి. బోరుబావుల కింద వరి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబీన్, ఉల్లి తదితర పంటలను సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో రైతులకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. ఇటీవలి కాలంలో విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్ సరఫరాపై ఆంక్షలు విధించారు. ఉచిత విద్యుత్ సరఫరాను కేవలం నాలుగు గంటలకు పరిమితం చేశారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దేముల్ మండలంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బోరుబావులకు విద్యుత్ సరఫరా చేశారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 9.30 గంటల వరకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సమస్య అధికం

బోరు బావుల కింద సాగు చేస్తున్న అన్నదాతలకు విద్యుత్ సమస్య పట్టిపీడిస్తోంది. రైతు ప్రభుత్వంగా ఉన్న సర్కారే రైతులకు నీరు అందించకపోవడంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడుకోవాలని రైతులు విద్యుత్‌శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు తమ చేతుల్లో ఏమీ లేదంటూ చేతులెత్తేయడం గమనార్హం.

ఏటా రూ.132.92కోట్ల వసూళ్లు

విద్యుత్ శాఖ జిల్లాలో 3.32 లక్షల విద్యుత్ కనెక్షన్లు అందించింది. ప్రతి నెలా వ్యవసాయ కనెక్షన్లకు మినహా మిగతా కనెక్షన్లకు బిల్లులను వసూలు చేస్తున్నారు. ఏ మాత్రం గడువు ముగిసినా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీ పెయిడ్ మీటర్లు అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు లేవు. దీంతో ప్రతి ఆర్థిక సంవత్సరం జిల్లా నుంచి రూ.132.92కోట్ల ఆదాయం విద్యుత్ శాఖ ఖజానాకు చేరుతోంది. మరోవైపు విద్యుత్ శాఖ చేపట్టే అభివృద్ధి పనుల పేరిట అదనపు వసూలు చేయడం మామూలుగా మారింది. కాని వ్యవసాయ రైతులకు మాత్రం ఉచిత విద్యుత్ ను అందించడంలో విద్యుత్ శాఖ మీనామేషాలు లెక్కిస్తోంది.

ఆందోళన బాట..

ఉచిత విద్యుత్ సరఫరాపై ఆంక్షలు విధించడంతో రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. విద్యుత్ సరఫరా చేస్తారనే భరోసాతో పంటలను సాగు చేశామని, మరో నెల వ్యవధిలో కోతకొచ్చే సమయంలో సాగు నీరు అందకుండా బోరు బావులకు విద్యుత్ సరఫరాను తగ్గించడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, 9 గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని అంటున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

> **9 గంటలు అందించేలా చర్యలు చేపడతాం**
>
> వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో కొంత సమస్య నెలకొంది. అయినా రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని చూస్తున్నాం. త్వరలో విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పై నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల సరఫరా చేయలేకపోతున్నాం.
>
> – ఆదినారాయణ, ఈడీఈ, తాండూరు

ప్రియురాలు మోసం చేసిందని..

- నగరంలో యువకుడి ఆత్మహత్య
- చౌడాపూర్‌లో విషాదం




ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

చైతన్యపురి: ప్రేమించిన అమ్మాయి ఇంకొకరిని ప్రేమించి వివాహం చేసుకుంటుందన్న విషయాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ గ్రామానికి చెందిన కటిక కృష్ణాజీ కుమారుడు ప్రవీణ్‌కుమార్ (26) బీఈడీ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు సరూర్‌నగర్ శ్రీనివాస కాలనీలోన ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. బీఈడీ చదివే సమయంలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించాడు. నాలుగు సంవత్సరాలుగా వీరు కలిసిమెలసి ఉంటున్నారు. అయితే కొంత కాలంగా తనను కాదని వేరే యువకుడిని యువతి ప్రేమిస్తుండటంతో ప్రవీణ్‌కుమార్ మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం తెల్లవారు జామున ఒక సెల్ఫీ వీడియో తీసి, సూసైడ్ నోట్ రాసుకున్నాడు. సెల్ఫీ వీడియోను తన స్నేహితులు, బంధువులకు పంపించి..వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. అనంతరం నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వాట్సాప్ స్టేటస్‌లో వీడియో చూసిన స్నేహితులు ప్రవీణ్ ఉండే గదికి చేరుకుని కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవీణ్ రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రియురాలిలో అమ్మా నాన్నల ప్రేమను చూశా..

'చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాను. బీఈడీలో పరిచయం అయిన యువతిని మనసారా ప్రేమించాను. ఇద్దరం నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకున్నాం. అమ్మ, నాన్నల ప్రేమను తాను చూపించింది. నా జీవితం మొత్తాన్ని తనతో ఊహించుకున్నాను. ఆ అమ్మాయి లేకుండా బతకలేను. వేరొకరితో ప్రేమలో పడటాన్ని జీర్ణించుకోలేక పోతున్నా... అందుకే చనిపోతున్నా. నన్ను క్షమించండి. మిస్ యూ ఫ్రండ్స్...నా చివరి చూపు చూసేందుకు రండి..బై.' అని ప్రవీణ్‌కుమార్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

బాటిళ్ల శుద్ధి పరిశ్రమలో పేలుడు



పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శంషాబాద్: గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బాటిళ్ల శుద్ధి పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఎనిమిది మంది కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో సాహైల్ అనే వ్యక్తి ఓకే ఆర్ బ్రిడ్జీ సమీపంలో ఎస్‌ఎస్ ఎంటర్‌ప్రైజెస్ వివిధ రకాల బాటిళ్లను శుద్ధి చేసే పరిశ్రమను నడిపిస్తున్నాడు. ఇందులో కాలం చెల్లిన ఔషధాలు, కాస్మోటిక్స్, ఇతర రసాయన వ్యర్థాలకు సంబంధించిన బాటిళ్ల నుంచి వ్యర్థాలను తీసి శుద్ధి చేస్తుంటారు.

అర్ధరాత్రి సమయంలో ..

శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో రసాయన వ్యర్థాలను శుద్ధి చేసే ప్రక్రియలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇందులో సద్దాం, సాహిల్, రాయల్, అఫ్తాబ్, ఇస్తాంమతీ నుల్లా, కమిల్, మామా, ప్రతాప్‌సింగ్, అర్మాన్, హసన్ అనే కార్మికులు పని చేస్తున్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎనిమిది కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. కార్మికులంతా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

ప్రమాదకర పరిశ్రమ..

ఎస్‌ఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో వ్యర్థాల శుద్ధి సమయంలో ప్రతిరోజు పేలుళ్ల శబ్దాలు వస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. కార్మికులకు ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదని అధికారులు గుర్తించారు. రసాయన, ఔషధ, కాస్మోటిక్స్ కంపెనీల వద్ద కాలంటి చెల్లిన వాటిని లారీల్లో పెద్ద ఎత్తున తీసుకొచ్చి శుద్ధి చేస్తున్న క్రమంలో బయటికి వచ్చే వ్యర్థాలను కూడా పర్యావరణ హితంగా చేపట్టడం లేదని గుర్తించారు. అక్రమంగా నడిపిస్తున్న పరిశ్రమ యజమాని సాహేల్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



పశువులు కాస్తున్న చెంచుకాలనీ బాలలు

బాల్యం అడవి పాలు

కరోనా మహమ్మారి బాల్యాన్ని అడవి పాలు చేసింది. రెండేళ్ల క్రితం కరోనా కారణంగా విద్యార్థులు బడులకు దూరమయ్యారు. ప్రస్తుతం సాఫీగా సాగుతున్నా కొంత మంది తిరిగి వెళ్లడం లేదు. వికారాబాద్ మండలం మదన్‌పల్లి పంచాయతీ చెంచుపల్లికి చెందిన బాలలు పశువులను కాస్తున్నారు. మరోవైపు చెంచుపల్లిలో 5వ తరగతి వరకే ఉండటం వారికి చదువులను దూరం చేసింది. పై ఫొటోలో కనిపిస్తున్న పిల్లల్లో అత్యధికులు ఐదో తరగతి పూర్తి చేసుకున్న వారే ఉన్నారు. 6వ తరగతిలో చేరాలంటే మదన్‌పల్లికి, లేదా వికారాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. చెంచుపల్లి నుంచి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో వారి చదువులు ఆగిపోయాయి.

– వికారాబాద్ అర్బన్

మూడోసారి ఓటేసి మోసపోవద్దు

ప్రజలకు పిలుపునిచ్చిన జీవిత రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జీవిత

ధారూరు: బీఆర్‌ఎస్ పార్టీకి రెండు సార్లు ఓట్లు వేసి మోసపోయామని, మూడోసారి ఓటేసి మోసపోవద్దని సినీనటి, బీజేపీ అసెంబ్లీ పాలక్ జీవిత రాజశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గురుదోట్ల, పీసీఎంతండా, అంపల్లి గ్రామాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జి గోపాల్ అధ్వర్యంలో శక్తికేంద్ర సమావేశాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవిత రాజశేఖర్ మాట్లాడుతూ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులు వేగిరం చేస్తామన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తదితర వాటి పేరిట రూ. లక్షల కోట్లు దండుకుంటున్న బీఆర్‌ఎస్ అధినేతలకు తగిన బుద్ధి చెప్పే కాలం ఆసన్నమైందని అన్నారు. బీజేపీ నుంచి మీ దగ్గరకు రావడానికి, అవకాశం వచ్చిందని అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, వారి బాగోగులు చూడకుండా కుటుంబ పాలన సాగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం వచ్చిందన్నారు. కేంద్రంలో పీఎం నరేంద్రమోదీ పాలన.. దేశం అభివృద్ధి చెందుతున్న తీరుపై విపులంగా వివరించారు. గిరిజనుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారితో కలిసి వారి సంప్రదాయ నృత్యాన్ని చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వపాలన

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

కుల్కచర్ల: రాష్ట్రంలో నియంతృత్వ పాలన, కుటుంబ పాలన కొనసాగుతున్నదని, ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిందేనని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాల్వీడు, చౌడాపూర్ మండలం కల్మన్‌కాల్వ గ్రామంలో శక్తికేంద్రాల అధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, అవినీతి రహిత పాలన అందిస్తోందన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కేసీఆర్ హామీల అమలులో చిత్తశుద్ధిలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, నియోజకవర్గ నాయకుడు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్ ముదిరాజ్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నేతలు

కుల్కచర్ల: యువత అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం పుర్సంపల్లి గ్రామంలో శనివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఆర్ఆర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ఉన్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, నాయకులు రాములు, ఆనందం, తుప్పలి అశోక్, మందిపల్ వెంకట్, భరత్ కుమార్, పర్గి అశోక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



పూజలో పాల్గొన్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కామునిపల్లిలో నిర్వహించిన జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివ మాలధారణ పవిత్రమైనదన్నారు. మాలధారణ వల్ల ఆలోచన విధానాల్లోనూ ఉత్తమమైన మార్పులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రాఘవేందర్, నాయకులు నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన చంద్రమౌళి, కృష్ణయ్య, వెంకట్రాములకు చెందిన గడ్డివాములు 11కేవీ వైర్లు తగిలి మంటలు చెలరేగడంతో గడ్డివాములకు నిప్పంటుకుని మూడు గడ్డివాములు కాలిబూడిదయ్యాయి. ముగ్గురు రైతులకు చెందిన గడ్డివాముల విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పశువుల సంతను మార్చండి

ప్రజల డిమాండ్

- ప్రతిపాదనలకే పరిమితమైన స్థల పరిశీలన
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న జనం



వికారాబాద్ పశువుల సంత

వికారాబాద్ అర్బన్: పట్టణం మధ్యలో ఉన్న పశువుల సంతను పట్టణానికి దూరంగా తరలించాలనే డిమాండ్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. గతంలో రైతు బజార్ పక్కనే పశువుల సంత నిర్వహించేవారు. ఆదివారం రోజునే పశువుల సంత జరగడం, రైతు బజారుకు వినియోగదారులు ఎక్కువగా వస్తుండటంతో ఆ రోడ్డు వాహనాలతో, పశువులతో, జనాలతో రద్దీగా ఉంటోంది. ఈ సంత ప్రధాన రహదారి పక్కనే ఉండటం, పాఠశాలలు, కళాశాలు సమీపంగా ఉండడంతో సమస్య జఠిలంగా మారింది. దీంతో పట్టణ వాసులు పశువుల సంతను మరో చోటుకు మార్చాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో ఐదేళ్ల క్రితం పశువుల సంతను మార్చేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా సమస్య కొలిక్కిరాలేదు. పశువుల సంతను వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్థల పరిశీలన పూర్తి

వికారాబాద్ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాలపురం గ్రామ సమీపంలో పశువుల సంత ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే స్థల పరిశీలన చేశారు. పలుకారణాల వల్ల సంత మార్పు సాధ్యం కాలేదు. గ్రామ సమీపంలోని సర్వే నెం.135లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇక్కడ నాలుగు ఎకరాల వరకు అందుబాటులో ఉన్నా వికారాబాద్ పట్టణానికి 7 కిలోమీటర్ల దూరం ఉండటంతో వ్యాపారులు, రైతులు ఎబ్బందులు పడుతారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులు ఆ ఆలోచన విరమించుకున్నారు. గెరిగెట్‌పల్లి గ్రామంలోని సర్వే నెం.28లోని భూమిని పరిశీలించారు. ఇక్కడ నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఈ స్థలం పశువుల సంతకు అన్నీ రకాల అనువైనదని, పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉండటంతో ఏర్పాటుకు నిర్ణయించారు. నిర్ణయం జరిగి చాలా కాలం అయినా అక్కడ పశువుల సంతకు సంబంధించిన ఎలాంటి ఏర్పాట్లు సాగడం లేదు. దీంతో పట్టణ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పోటెత్తిన పోలేపల్లి

- నాలుగోరోజు కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు
- నేడు అమ్మవారి ఊరేగింపు



భక్తులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు

బొంరాస్‌పేట: నాలుగు రోజులుగా కన్నుల పండువగా సాగిన పోలేపల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి కోనేటి స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు చేసి కోడిపుంజులు, కొబ్బరికాయలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ముచ్చటి వెంకటేశ్ చెప్పారు. ఉత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, రేణుక ఎల్లమ్మ యువజనసంఘం అధ్యక్షుడు బుగ్గప్ప, ఆలయకమిటీ సభ్యులు సురేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నరేశ్‌గౌడ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

పేదల పెళ్లికి.. ఎమ్మెల్యే ఆభరణాలు

సొంత ఖర్చుతో వివాహం జరిపించిన నరేందర్‌రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న మధు, వాణిశ్రీ దంపతులు

కొడంగల్: పేదింటి దళిత జంటకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సొంత ఖర్చుతో వివాహం జరిపించారు. బొంరాస్‌పేట మండలం ఎనికేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కళావతి, వెంకటేశ్‌లకు ఆదివారం పట్టణంలోని శ్రీవారి ఆలయ ఆవరణలో ఉన్న వరాహస్వామి సన్నిధిలో వివాహ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్థిక సహకారంతో పుస్తె, మెట్టెలు, వధూవరులకు, వారి తల్లిదండ్రులకు కొత్త బట్టలు, బాసింగాలు, రాకపోకలకు వాహనాలు , భోజనాలు తదితర ఖర్చులన్నీ ఎమ్మెల్యేనే భరించారు. అసెంబ్లీ సమావేశాలున్నందున ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తరపున కొడంగల్ 2వ వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, ఆయన భార్య మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణీశ్రీ దంపతులు వధువరులకు పుస్తె మెట్టెలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళావతి, వెంకటేశ్‌ల వివాహాన్ని నిశ్చయించిన కుటుంబ సభ్యులు పెళ్లి ఖర్చులకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఆయన వివాహం చేయిస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు వివాహం ఘనంగా నిర్వహించారు. దీంతో నూతన వధూవరులు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

- ఆలయాభివృద్ధికి కృషి: జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రులు చంద్రశేఖర్, ప్రసాద్‌కుమార్



పూజలకు హాజరైన చంద్రశేఖర్, జీవిత తదితరులు

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ప్రత్యేక పూజల నడుమ ఆంజనేయ విగ్రహం, ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహాలు, ఊరడమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ పూజా కార్యక్రమాలకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి రూ.లక్ష చొప్పున ఉత్సవ కమిటీకి నగదు అందజేశారు. ఈ నగదును బ్యాంకులో డిపాజిట్ చేసి ఆలయ అర్చకుడికి, పారిశుద్ధ్య కార్మికుడికి ఖర్చు చేయాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే గ్రామాభివృద్ధికి జెడ్పీ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో మాజీ జెడ్పీటీసీ శోభారాణి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, సర్పంచ్ ఇందిర, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామేశ్వర్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, పంచలింగాల, నర్సాపూర్, సర్పంచ్‌లు సురేందర్‌రెడ్డి, ధరమ్‌సింగ్, పట్లూర్ ఎంపీటీసీ సభ్యులు మంజుల, స్వప్న, బీఆర్ఎస్ నాయకులు సురేశ్, వెంకట్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్, గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రుల ప్రత్యేక పూజలు

పట్లూర్‌లో నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ముగింపు ఉత్సవాల్లో మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్‌కుమార్, డాక్టర్ ఎ.చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు జీవిత రాజశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద్ కుమార్ ఉత్సవ కమిటీకి రూ.50వేల విరాళం అందజేశారు. ఈ పూజల్లో నాయకులు శంకర్, శివప్రసాద్, సురేశ్, కాంగ్రెస్ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా కార్యదర్శులు సంజీవరెడ్డి, గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సురేశ్, లక్ష్మారెడ్డి, రఫియుద్దీన్, మధూకర్ రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, మండల నాయకులు సర్వేశ్, గణేశ్, రాజు, రాకేశ్, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఉత్సవ కమిటీ చైర్మన్, సర్పంచ్ ఇందిర శాలువతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

చైల్డ్‌లైన్ ప్రతినిధి రాములు



పెళ్లిని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది

దోమ: బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్‌లైన్ ప్రతినిధి రాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో ఓ మైనర్‌కు(17)కు చౌడాపూర్ మండలానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయించారు. విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్ సిబ్బంది పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాలికలకు 18ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని తల్లితండ్రులకు సూచించారు. మైనర్‌లకు వివాహం చేసే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికలకు భద్రత కల్పించండి

డీఎస్పీకి విన్నవించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తాండూరు: లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికకు కావాలనే అడ్డుపడుతున్నారని అసోసియేషన్ సభ్యులు ఆదివారం డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ను ఆశ్రయించారు. ఎన్నికలు ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు తమకు భద్రత కల్పించాలని కోరుతూ వినతితత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము రెండు నెలలుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ ఓనర్లకు సభత్వనమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. సభ్యత్వాలు పూర్తైన వెంటనే అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలి. కానీ ఏళ్ల నుంచి ఒక్కరిద్దరే అసోసియేషన్ ఆధిపత్యం చలాయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఏకగ్రీవం పేరిట ఎన్నికను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు సామరస్యంగా ఎన్నిక నిర్వహించుకోవాలని సూచించారు.

హక్కుల సాధనకు ఏకమవ్వండి

వడ్డెర కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పరిగి: హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరు ఏకం కావాలనని వడ్డెర కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడ్డెరలను ఎస్టీ జాబితాలోకి మార్చాలని ప్రభుత్వంపై నిత్యం ఒత్తిడి తెస్తున్నామన్నారు. ఇందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలంతా తమ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితాలోకి మార్చేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదయ్య, మణి, ఆశన్న, ఆంజనేయులు, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆలయాల్లో మానసిక ప్రశాంతత

హైదరాబాద్ సేల్స్ ట్యాక్స్ రిటైర్డ్ అధికారి రమేశ్

మొయినాబాద్‌రూరల్: ఆలయాల్లో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్ సేల్స్ ట్యాక్స్ రిటైర్డ్ అధికారి సంగం రమేశ్ అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి పంచాయతీ పరిధిలోని జీవన్‌గూడలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఆలయాలను నిర్మించుకుని.. ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన అజీనగర్ గ్రామస్తుడు చన్‌వెల్లి నరేందర్‌రెడ్డి, ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందజేసిన సంగం రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. సోమవారం అమ్మవారి ప్రతిష్ఠాపన పూజలు, మంగళవారం అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పనతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

గొర్రెల మందపై హైనా దాడి

32 జీవాలు మృతి

కడ్తాల్: గొర్రెల మందపై హైనా దాడి చేయడంతో 32 గొర్రెలు మృత్యువాత పడగా మరో తొమ్మిది తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని ముక్తమాదారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు కట్ల శ్రీశైలం తెలిపిన ప్రకారం.. తెల్లవారుజామున మందపై హైనా దాడిచేయడంతో గొర్రెలు మృత్యువాతపడి సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ బాధితుడిని పరామర్శించి, రూ.6వేలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, ఎంపీటీసీ సభ్యుడు గోపాల్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత రైతుకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తూకంలో మోసం.. ధరల్లో వ్యత్యాసం

- రెచ్చిపోతున్న చిల్లర వ్యాపారస్తులు
- పట్టించుకోని వ్యవసాయ మార్కెట్ అధికారులు



చిల్లర వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి, కందులు

వికారాబాద్ అర్బన్: అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పేరుకు చిల్లర వ్యాపారం కానీ లక్షల్లో సంపాదన. ఇది పట్టణ పరిధిలో ప్రతీ ఆదివారం, గురువారం కొనసాగుతోన్న దందా.

మార్కెట్‌కు రాకుండానే..

వికారాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రతీ ఆది, గురు వారాల్లో ధాన్యానికి బీట్లు వేస్తుంటారు. అక్రమార్కుల వ్యాపారంతో మార్కెట్‌కు రావాల్సిన ఆదాయానికి అడ్డుకట్టపడుతోంది. చుట్టుపక్కల గ్రామాల రైతులు కందులు, మొక్కజొన్నలు, పత్తి, ఇతర పంటలను మార్కెట్లో అమ్మేందుకు ఆటోల్లో, ట్రాక్టర్లలో తీసుకువస్తుంటారు. వీరిని ఆర్టీసీ డిపో వద్ద కొందరు చిల్లర వ్యాపారులు, ఆలంపల్లి సమీపంలో మరి కొందరు కాపు కాసి వాహనాలను ఆపుతున్నారు. మాయ మాటలు చెప్పి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. తూకంలో భారీగా మోసం చేయడంతో పాటు, ధరలోనూ వ్యత్యాసం ఉంటుంది. ఇలా ఒక్క రోజులోనే వంద సంచుల కందులు, ఒకటి రెండు లారీల పత్తిని జమచేసి ఇతర వ్యాపారుల వద్దకు తరలిస్తుంటారు. ఈ విషయం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యాపారులు ప్రతీ వారం సంబంధిత అధికారులకు ముడుపులు ఇస్తుండటంతోనే పట్టించుకోవడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

- ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి
- మైసిగండిలో 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర ప్రారంభం

కడ్తాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర సందేశం ప్రతీ గడపకు చేర్చాలనే ఉద్దేశంతో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఆదివారం మైసిగండి నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేశారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని, రైతులు అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద కొంతమంది పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి తదితర హామీలన్నీ తుంగలో తొక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ యాత్రలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు నర్సింహ, మహేశ్, రాములు, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, సేవ్యానాయక్, అనిల్, బీచ్యానాయక్, అజీం, చేగూరి వెంకటేశ్, సర్పంచ్ శంకర్, లక్ష్మయ్య, మల్లయ్య, జవహర్‌లాల్, హీరాసింగ్ తదితరులున్నారు.



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో వంశీచంద్‌రెడ్డి